సాక్షి
కుమురం భీం
మంగళవారం ၊ 5 ၊ మార్చి ၊ 2024



ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు సంజయ్, బాపూరావు, ఎమ్మెల్యేలు శంకర్, మహేశ్వర్‌రెడ్డి, హరీశ్‌బాబు


సభకు హాజరైన జనం

ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

మోదీ, యోగి చిత్రాలను ఛాతిపై టాటు వేసుకున్న యువకుడు

బొమ్మ జోష్

- పార్లమెంట్ ఎన్నికలకు బీజేపీ శంఖారావం
- మోదీ సభ సక్సెస్‌తో విజయంపై ధీమా
- అధికారిక ప్రోగ్రాంలో ప్రధానితో వేదిక పంచుకున్న గవర్నర్, సీఎం
- కాషాయ శ్రేణుల్లో జోష్ నింపిన పీఎం ఆదిలాబాద్ టూర్

కమలం.. సమరోత్సాహం

సాక్షి,ఆదిలాబాద్/కైలాస్‌నగర్:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదిలాబాద్ పర్యటన కమలం పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది. పార్లమెంట్ ఎన్నికలకు సన్నాహకంగా ఇప్పటికే బీజేపీ విజయ సంకల్ప యాత్ర తలపెట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పూర్తిచేసింది.తాజాగా ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి తెలంగాణలో తెరలేపారు. ఆదిలాబాద్ నుంచి సోమవారం శంఖారావం పూరించారు. సభ సక్సెస్‌తో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లోనూ విజయం సాధిస్తామనే ధీమా ఆ పార్టీ నేతల్లో కనిపిస్తోంది. తనప్రసంగంతో మోదీఆకట్టుకోగా.. ఆయా అంశాలపై ప్రజలు ఉత్సాహంగా స్పందించారు.

అధికారిక కార్యక్రమం, సభ..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి మోదీ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. నాగ్‌పూర్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉదయం 11.40 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక విమానాశ్రయ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగారు. పార్టీ శ్రేణులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాని రోడ్డు మార్గంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకున్నారు. ఇక్కడ రెండు వేదికలు ఏర్పాటు చేయగా, మొదటి వేదికలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మోదీతో వేదిక పంచుకున్నారు. దేశానికి సంబంధించి రూ.56వేల కోట్ల అభివృద్ధి పనులు ఉండగా, అందులో రాష్ట్రానికి సంబంధించి రూ.6,697 కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేశారు. ఇక్కడ ప్రధాని కంటే ముందు రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి ప్రసంగించారు. దాదాపు అరగంట పాటు ఈ కార్యక్రమం సాగింది. అనంతరం గవర్నర్, సీఎం వెనుదిరగగా.. బహిరంగ సభ జరిగే రెండో వేదికపైకి మోదీ చేరుకున్నారు. ప్రధాని రాక ముందు పలువురు బీజేపీ నాయకులు ప్రసంగించగా, వచ్చిన తర్వాత మొదట ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఆ తర్వాత ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రసంగించారు. తర్వాత మోదీ ప్రసంగం సుమారు 20 నిమిషాల పాటు సాగింది. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చెబుతూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అనంతరం సభ ముగిసింది. ప్రధాని బయల్దేరి వెళ్లారు. మొత్తంగా ప్రధాని జిల్లాలో దాదాపు రెండు గంటల పాటు గడిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి హన్సరాజ్ గంగారాం అహిర్, బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్‌బాబు, రామారావు పటేల్, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, సీనియర్ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, పార్లమెంట్ ప్రభారి అల్జాపుర్ శ్రీనివాస్, మంచిర్యాల ఇన్‌చార్జి రఘునాథ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ తదితరులు పాల్గొన్నారు.

వీవీఐపీల తాకిడి.. హెలికాప్టర్ల సందడి

వీవీఐపీల రాకతో ఆదిలాబాద్‌లో సందడి నెలకొంది. గగనతలంలో హెలికాప్టర్ల సందడి జనాన్ని కనువిందు చేసింది. ప్రధాని మోదీకి ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలికేందుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేశారు. ప్రధాని ప్రయాణించిన హెలికాప్టర్‌తో పాటు మరో రెండు హెలికాప్టర్లు కూడా ఆయన వెంట వచ్చాయి. గవర్నర్, సీఎం వేర్వేరు హెలికాప్టర్లలో జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మరో హెలికాప్టర్‌లో వచ్చారు. మొత్తంగా ఆరు హెలికాప్టర్లు ఉదయం గగనతలంలో విహరించాయి. ఆ చప్పుడు విన్నప్పుడు సభ ప్రాంగణానికి అప్పటికే విచ్చేసిన జనం కేరింతలు కొట్టారు. మొత్తంగా వీవీఐపీలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో స్వాగతించారు. కాగా, సభకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత స్థానిక కలెక్టరేట్ రోడ్డు, హౌసింగ్ బోర్డు వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ కనిపించింది.


ప్రధాని మోదీని శాలువాతో సత్కరిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి


ప్రధానికి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రధానితో 'సోయం' ముచ్చట


ఎంపీ సోయంతో ముచ్చటిస్తున్న మోదీ

సభలో ప్రధాని మోదీతో ఎంపీ సోయం బాపూరావు ముచ్చటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ అధిష్టానం ఈనెల 2న ప్రకటించగా అందులో 'సోయం'కు చోటు దక్కలేదు. దీంతో ఈ సారి ఆయన్ను మార్చుతున్నారనే ప్రచారం నేపథ్యంలో మోదీతో ముచ్చటించడం సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎంపీ సీటు గురించే మాట్లాడారా.. జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల మంజూరుపై చర్చించి ఉంటారా అనే చర్చ సాగుతోంది. దీనిపై ఎంపీ 'సోయం'ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా అలా ఎలా చెబుతారని పేర్కొనడం గమనార్హం.

జిల్లా అభివృద్ధికి సహకరించాలి



ఆదిలాబాద్ జిల్లాకు గత 40 ఏళ్లలో ప్రధానమంత్రి హోదాలో ఏ నాయకుడు రాలేదు. మనందరి అభిమాన నాయకుడు ప్రధాని మోదీ ఆదివాసీలు, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో పాదం మోపడమంటే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమైనట్టే. జిల్లా ప్రజలు దశాబ్దాల తరబడి ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ కోసం ఎదురుచూస్తున్నారు. వెనుకబడిన ఈ జిల్లాకు రైలు సౌకర్యం కల్పించేలా ఈ లైన్‌ను మంజూరు చేయాలి. అలాగే రాష్ట్రంలో ఆదిలాబాద్ మినహా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏదో ఒక యూనివర్సిటీ ఉంది. ఈ ప్రాంత పరిధిలోనూ యూనివర్సిటీని మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలి.

– సోయం బాపూరావు, ఎంపీ, ఆదిలాబాద్

సీసీఐని పునరుద్ధరించాలి



ఆదిలాబాద్‌లో మూతపడ్డ సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి. 5వేల మందికి తిరిగి ఉపాధి కల్పించాలి. పరిశ్రమను తెరిపిస్తే వెనుకబడ్డ ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశముంటుంది. అలాగే ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ మంజూరు చేయడంతో పాటు జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుని ఈ ప్రాంతాభివృద్ధికి కృషి చేయాలి. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యమందించేలా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించిన ప్రధాని నరేంద్రమోదీకి జిల్లా ప్రజల పక్షాన ధన్యవాదాలు.

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

ప్రాణహిత ప్రాజెక్ట్ పూర్తి చేయాలి



తూర్పు ప్రాంతంలోని ప్రాణహిత ప్రాజెక్ట్ 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేసి అక్కడి భూములను సస్యశ్యామలంగా మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మోదీని మూడో సారి ప్రధానిగా చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇందుకోసం తెలంగాణలోని మెజార్టీ సీట్లు గెలవాలి. ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని తప్పకుండా కైవసం చేసుకుంటాం. ఇప్పటికే బీఆర్‌ఎస్ కాలగర్భంలో కలిసిపోయింది. ఆ పార్టీకి అభ్యర్థులే దొరకడం లేదు. అధికారంలోకి వచ్చే అవకాశమే లేని కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రయోజనం ఉండదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎనిమిది మంది ఎమ్మెల్యేలం రాష్ట్రానికి ఎనిమిది దిక్కుల్లా నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్

హైదరాబాద్ ఎంపీ సీటునూ గెలుస్తాం



బీజేపీ గెలుపుకోసం ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. గత పదేళ్లలో ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమపరంగా దేశ రూపురేఖలనే మార్చారు. అలాంటి మోదీ ఆదిలాబాద్ నుంచే విజయపరంపర సాగించేలా ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చారు. మోదీ హయంలో ఎంతో భద్రత ఉందని, ఈ ఎన్నికల్లో 400ఎంపీ స్థానాలను పార్టీ గెలువాలని ప్రజలు కోరుకుంటున్నారు. దేశానికి, బీజేపీకి మోదీయే శ్రీరామరక్ష. బీఆర్‌ఎస్ మునిగిపోగా, కాంగ్రెస్‌కు గెలుపుపై నమ్మకం లేదు. ఈసారి హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని కూడా బీజేపీ గెలుచుకోవడం ఖాయం. ఆర్టికల్ 370ని రద్దుచేశాక ప్రజలంతా మోదీని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారు.

– అల్జాపూర్ శ్రీనివాస్, పార్లమెంట్ ప్రభారీ

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై స్పందించాలి


ఫిర్యాదు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు వేగంగా స్పందించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం అర్జీలు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలన్నారు. ప్రతీ ఫిర్యాదును చట్ట పరిధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఫస్టియర్ పరీక్షకు 5,714 మంది విద్యార్థులకు 5,402 హాజరు కాగా 312 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 4,820 మందికి 4,591 మంది హాజరు కాగా, ఒకేషనల్ విభాగంలో 894 మందికి 811 హాజరయ్యారని డీఐఈవో శంకర్ తెలిపారు.

'కాగజ్‌నగర్' చైర్‌పర్సన్‌గా
షాహీనా సుల్తానా

- మున్సిపల్ వైస్ చైర్మన్‌గా స్వామిశెట్టి రాజేందర్
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు


చైర్‌పర్సన్ షాహీనా సుల్తానా


వైస్‌చైర్మన్ స్వామిశెట్టి రాజేందర్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మున్సిపల్ నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లను సోమవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సురేశ్‌కుమార్ అధ్యక్షతన ఈ ఎన్నిక నిర్వహించారు. గత మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్‌చైర్మన్ గిరీశ్‌కుమార్‌పై జనవరి 20న కౌన్సిల్ సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గిన విషయం తెలిసిందే. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 26 మంది కౌన్సిలర్లు హాజరు కాగా, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా షాహీన్ సుల్తానాకు 26 మంది మద్దతు తెలిపి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వైస్‌చైర్మన్‌గా స్వామి శెట్టి రాజేందర్‌కు 21 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ను రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సురేశ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లందరూ మున్సిపల్ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికైన వారిని కోనప్ప సతీమణి రమాదేవి, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అభినందించారు. టపాసులు కాల్చి స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 16న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో అధిక కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో జిల్లా జూనియర్ న్యాయమూర్తి అనంతలక్ష్మితో కలిసి సోమవారం పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్‌ల వారీగా కేసులపై దృష్టి సారించాలన్నారు. ఆసిఫాబాద్ ఎస్‌డీపీవోటీపీ సదయ్య, సీఐలు అంజయ్య, శ్రీనివాస్, చిట్టిబాబు, అగ్నిమాపక శాఖ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మా ప్రాంతంలో మొదటి ప్రభుత్వ ఉద్యోగిని

- సాఫ్ట్‌వేర్ జాబ్‌లో సంతృప్తి లేదు..
- ఐపీఎస్‌గా పనిచేసినా.. ఐఏఎస్ లక్ష్యంగా చదివి సాధించా
- 'సాక్షి'తో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

సాక్షి, ఆసిఫాబాద్: అతనిది కర్ణాటకలోని బెళగాం ప్రాంతం. అక్కడ చదువుకున్న వారంతా ప్రైవేటు ఉద్యోగాల వైపు మొగ్గు చూపుతుంటారు. తను కూడా ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలోనే పనిచేశాడు. అయితే అందులో సంతృప్తి కనిపించకపోవడంతో మిగిలిన వారికంటే భిన్నంగా ఆలోచించాడు. ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో చదివాడు. మొదటి ప్రయత్నంలో ఐపీఎస్ సాధించాడు. ఆ ప్రాంతం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మొట్టమొదటి వ్యక్తిగా పేరు తెచ్చుకున్నాడు. ఐపీఎస్ అధికారిగా పని చేస్తూనే నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించి.. సోమవారం బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్ దోత్రే తన స్వీయానుభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''మాది కర్ణాటక రాష్ట్రంలోని బెళగాం. నాన్న వ్యాపారి, అమ్మ గృహిణి.. ఇంటికి నేను పెద్ద కుమారుడిని. నా తర్వాత ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడు ఉన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న మేఘాతో వివాహం కాగా.. పాప, బాబు ఉన్నారు. నా పాఠశాల, కళాశాల విద్యాభ్యాసమంతా బెళగాంలోనే సాగింది. బెంగళూరులోని పీఈఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో 82.53 శాతంతో పట్టా సాధించా. బెంగుళూరులోని ఇట్టికాం సిస్టమ్స్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఏడాదిన్నర పాటు పనిచేశా. ఆ పని నాకు సంతృప్తి ఇవ్వలేకపోయింది. అప్పుడు సివిల్స్ వైపు దృష్టి మళ్లింది. పైగా స్నేహితుల కుటుంబాలను చూసి.. ఐఏఎస్ సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పచుకున్నా. పైగా అప్పటి వరకు మా ప్రాంతం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారు ఎవరూ లేరు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి.. ఢిల్లీ వెళ్లి ఏడాదిన్నర సివిల్స్ కోసం శిక్షణ పొందాను. మొదటి ప్రయత్నంలో 2014లో ఐపీఎస్ ర్యాంకు సాధించా. ఐపీఎస్ ట్రైనింగ్ తర్వాత అసోం రాష్ట్రంలో పోస్టింగ్ వచ్చింది. దీంతో మా ప్రాంతం నుంచి ప్రభుత్వం ఉద్యోగం సాధించిన మొదటి వ్యక్తిని నేనే అయ్యా. ఐపీఎస్ అధికారిగా పనిచేస్తూనే ఐఏఎస్ సాధించాలన్న పట్టుదలతో మరో మూడుసార్లు సివిల్స్ పరీక్ష రాశా. నాలుగో ప్రయత్నంలో 2017లో ఐఏఎస్ ర్యాంకు రావడం.. తెలంగాణ క్యాడర్‌కు నన్ను కేటాయించడంతో శిక్షణ తర్వాత 2020లో కామారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా మొదట పోస్టింగ్ దక్కింది. తర్వాత 2022లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ)కు బదిలీ అయ్యా. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనే పదోన్నతిపై కుమురం భీం జిల్లా కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఎంతో సంతోషించా. వెనుకబడిన గిరిజన జిల్లాలో పనిచేయడం ఒక ఛాలెంజ్‌గా భావిస్తున్నా. అధికారుల సహకారంతో అభివృద్ధిలో మార్పును తీసుకువస్తా.

పక్కా ప్రణాళికతో అభివృద్ధి

జిల్లా కలెక్టర్‌గా వెంకటేశ్ దోత్రే బాధ్యతలు స్వీకరించిన తర్వాత సాయంత్రం మీడియాతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం అభివృద్ధిపై దృష్టి సారిస్తే బాగుంటుందని, ప్రజల గుండెల్లో నిలిచిపోతారని 'సాక్షి' పేర్కొనగా.. గ్రేటర్ హైదరాబాద్‌లో పని చేసిన అనుభవం ఉందని, పక్కా ప్రణాళికతో జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ఐపీఎస్ నుంచి ఐఏఎస్‌కు ఎందుకు వచ్చారని మీడియా ప్రతినిధులు అడగగా.. కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఐఏఎస్ లక్ష్యంగా సాధించానన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురై అన్యాక్రాంతమవుతున్నాయని ఆయన దృష్టికి వెళ్లగా.. సమస్యలు ఒకటి తర్వాత ఒకటి పరిష్కరిస్తానన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని రాపల్లిలో సోమవారం పోలీసులు, రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్రమంగా రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో ఆనె సత్తయ్య ఇంట్లో దాడి చేసి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు తిరుపతి, రాజు పాల్గొన్నారు.

గిరిజన రైతు ఆత్మహత్య

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం కొత్తగూడకు చెందిన గిరిజన రైతు మడావి ఆనంద్‌రావు (28) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంపుల విజయ్ తెలిపారు. ఆనంద్‌రావుకు జోడేఘాట్ గ్రామానికి చెందిన జ్యోతితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 1న దంపతుల మధ్య గొడవ జరగడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆనంద్‌రావు మద్యం మత్తులో ఊరిబయట ఉన్న చింతచెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. మృతుని సోదరుడు మడావి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చేరిక

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వే స్టేషన్‌లోని రెండో ప్లాట్ ఫామ్‌పై తలకు గాయమై అపస్మారక స్థితిలో పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తిని 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మాట్లాడే పరిస్థితిలో లేడన్నారు. వివరాలకు 8712658596 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి'



మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఓసీపీల్లో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో బ్లాస్టింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓబీ కాంట్రాక్టు సంస్థ బ్లాస్టింగ్‌లో పనిచేసే కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తోందన్నారు. కోలిండియాలో రోజుకు రూ.1,199 చెల్లిస్తుండగా ఇక్కడ కేవలం రూ.504 మాత్రమే ఇస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ కొత్తగా జీవో 94 తీసుకువచ్చి కార్మికులకు మరింత అన్యాయం చేసిందన్నారు. జీవో 22ను వెంటనే అమలు చేసి కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

హెల్త్‌ప్రొవైడర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

పాతమంచిర్యాల: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో మిడ్‌లెవల్ హెల్త్‌ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో జీసీ సుబ్బారాయుడు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను కార్యాలయ నోటీస్ బోర్డుపై ఉంచామన్నారు. మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు ఈ నెల 6న డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూ/కౌన్సిలింగ్‌కు ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు.



మోదీ ప్రసంగాన్ని సెల్‌ఫోన్‌తో వీడియో తీస్తున్న మహిళ

మోదీ రాకతో మస్తు జోష్!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్వాగతం పలికారు. సభకు భారీగా జనం తరలివచ్చారు. దీంతో పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలకు నమస్కరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



బండి సంజయ్‌తో నిర్మల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు



మోదీ సభకు వస్తున్న ప్రజలు, కార్యకర్తలు



బీజేపీ జెండాతో మహిళలు, యువతులు



ఏర్పాట్లపై పోలీసులతో మాట్లాడుతున్న శంకర్



వీఐపీ గ్యాలరీ వద్ద క్యూ



మోదీ ప్రసంగానికి చప్పట్లు కొడుతున్న మహిళలు

ప్రధాని సభ సైడ్‌లైట్స్

కైలాస్‌నగర్: విజయ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించి న బహిరంగసభకు ప్రధానీ నరేంద్రమోదీ హాజరయ్యారు.

- ఉదయం 10.20 గంటలకు ప్రధాని ఆదిలాబాద్‌కు రావాల్సి ఉండగా 11.40 గంటలకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.14 నిమిషాలకు బహిరంగ సభ వేదికపైకి చేరుకున్నారు.
- ప్రధానికి స్వాగతం పలికేందుకు జిల్లా కేంద్రానికి ఉదయం 09.30గంటలకే చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళి సై ప్రధాని జిల్లాకు చేరుకున్న సమయంలో హెలిప్యాడ్ వద్ద అందుబాటులో లేరు. అధికారిక కార్యక్రమాల వేదిక వద్దకు చేరుకున్నాకే మోడీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.
- సభ వేదికపై మోడీకి ఓ వైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మరోవైపు సోయం బాపూరావులు కూర్చున్నారు. ప్రధానీతో సోయం మాట్లాడటాన్ని సభికులు ఆసక్తిగా గమనించారు.
- స్టేడియంలో అధికారిక కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన సభ వేదికపైకి ప్రధానీ 11.40గంటలకే చేరుకున్నారు. కానీ బహిరంగ సభ వేదికపైకి వచ్చే వరకు సభకు హా జరైన ప్రజలకు ఈ విషయం తెలియలేదు.
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సభవేదికపైకి వచ్చిన సమయంలో ప్రజలు సీఎం సీఎం అంటూ కేరింతలు కొట్టారు.
- మధ్యాహ్నం 12.27 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ సరిగ్గా ఇరవై నిమిషాలు ప్రసంగించారు.
- ప్రసంగంలో ఆదివాసీ గిరిజన పోరాట యోధులు రాంజీగోండ్, కుమురంభీంలను స్మరించుకున్నారు.
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, సభ ప్రాంగణంలో తాగునీటి వసతి కల్పించినప్పటికీ బాటిల్స్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కాసిపేట 2గనిపై వరుస చోరీలు



దొంగిలించిన వైర్ల చోట అమర్చిన కొత్తవైర్లు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై వరుస చోరీలతో అధికారులు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం రాత్రి సెకండ్ షిఫ్టులో మెయిన్ హాలర్ నుంచి సుమారు 60 మీటర్ల ఫ్లెక్సిబుల్ కాపర్ వైరు చోరీకి గురైంది. ఇటీవల గని ఆవరణలో 185 స్క్వేర్ మి.మీ కేబుల్ చోరీకి గురైంది. గనికి ప్రహరీ లేకపోవడంతో పాటు ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది కొరత కారణంగా చోరీలు జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. కాగా చోరీలు ఇంటిదొంగల పనేనా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతీసారి ఐడీల్‌లో ఉన్న (విద్యుత్ సరఫరా లేని) కేబుళ్లే పోతున్నాయి. వాటికి విద్యుత్ సరఫరా లేనట్లు దొంగలకు ఎలా తెలుస్తుంది? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆదివారం కేబుల్ నరికి తీసుకెళ్లకుండా నట్లు విప్పుకుని మరీ పట్టుకెళ్లారు. అంటే ఉద్యోగుల హస్తం ఉంటుందనే అనుమానం సైతం వ్యక్తమవుతోంది. ఎస్‌అండ్‌పీసీ మాత్రమే కాకుండా పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టిపెడితే దొంగలు దొరుకుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుని సంస్థ ఆస్తులు కాపాడాలని కార్మికులు కోరుతున్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: ఇజ్రాయిల్, జర్మనీ దేశాల్లో ఉద్యోగావకాశాలకోసం ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇజ్రాయిల్‌లో నిర్మాణ రంగంలో పని చేయడానికి షట్టరింగ్ కార్పెంటర్లు సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ పనులకు ఎస్సెస్సీ పాసై, సంబంధితరంగంలో మూడేళ్ల అనుభవం కలిగిన 21 నుంచి 45 ఏళ్లలోపువారు అర్హులన్నారు. జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల కోసం జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ పాసై 21 నుంచి 38 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిర్మాణ రంగ కార్మికులకు నెలకు రూ.1.20 లక్షల నుంచి 1.38 లక్షలు, నర్సింగ్ అభ్యర్థులకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలవారు ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9985483931/9849639593 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'ఎమ్మార్సీ'లో కంప్యూటర్లు చోరీ

దహెగాం: దహెగాం పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న ఎమ్మార్సీ కార్యాలయంలో కంప్యూటర్లు చోరీకి గురైనట్లు సిబ్బంది తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు సిబ్బంది కార్యాలయానికి రాగా కార్యాలయ తలుపు బెడెం తొలగించి ఉంది. లోపలికి వెళ్లిచూడగా రెండు కంప్యూటర్లు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కంప్యూటర్ల విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని వారు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న ఎమ్మార్సీ కార్యాలయంలో చోరీ జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. చోరీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈవో భిక్షపతి తెలిపారు.

'బుగ్గ' వేలంలో జాప్యం

బెల్లంపల్లిరూరల్: మహాశివరాత్రి జాతర పురస్కరించుకుని కన్నాల పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వేలంలో జాప్యం జరుగుతోంది. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జాతర జరగనుంది. గతనెల 8న దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కొబ్బరికాయలు, ప్రసాదాల విక్రయాలు, వాహనాల పార్కింగ్‌కు వేలం జరిగింది. సోమవారం తైబజారు నిర్వహణకు వేలం వేయగా ఆలయ కమిటీకి సంబంధం లేని వ్యక్తి అన్నీతానై అత్యుత్సాం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి. తన అనుయాయులకు దక్కాలనే సదరు వ్యక్తి వ్యవహార శైలితో వేలం జరగలేదు. ఈ విషయమై ఈవో బాపురెడ్డిని వివరణ కోరగా ఆలయంలో ఇతర వ్యక్తుల ప్రాబల్యం ఏమీ లేదని, మంగళవారం తైబజారు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌డీసీగా చంద్రకళ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ)గా డి.చంద్రకళ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ బి.సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అధికారుల సమన్వయంతో కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. గద్వాల ఆర్డీవోగా పని చేస్తున్న చంద్రకళను పదోన్నతిపై జిల్లా భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు.

సస్పెండైన ఎఫ్‌డీవో నాగభూషణంపై విచారణ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఎఫ్‌డీవోగా పని చేసిన నాగభూషణం కాంప నిధులు దుర్వినియోగం, విధుల్లో నిర్లక్ష్యం వహించారనే వివిధ ప లు ఆరోపణల మేరకు 2020లో మార్చిలో అప్పటి అటవీ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులు విచారణ జరిపినట్లు తెలిసింది. ఈ విషయమై సీఎఫ్ శాంతరాంను సంప్రదించగా.. వివరాల వెల్లడికి నిరాకరించారు.

యువకుడిపై పోక్సో కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. పాఠశాల సమీపంలో టీస్టాల్ నడుపుతున్న ముస్తఫా అనే యువకుడు పదో తరగతి చదువుతున్న బాలిక వెంటపడి వేధిస్తుండడంతో ఆమె తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత ఆసిఫాబాద్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం బాలికల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఆసిఫాబాద్ గురుకుల బాలికల జట్టు, సిర్పూర్ టౌన్ ఏకలవ్య పాఠశాల జట్లు ఫైనల్‌కు చేరుకుని హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్లో ఆసిఫాబాద్ గురుకుల బాలికల పాఠశాల జట్టు గెలుపొందగా రన్నరప్‌గా సిర్పూర్ టౌన్ ఏకలవ్య బాలికల జట్టు నిలిచింది. విజేతలకు కప్‌తో పాటు బహుమతులు ప్రదానం చేశారు.

మిస్టర్ ఐరన్ మ్యాన్‌గా అన్వర్



మిస్టర్ బెల్లంపల్లి టైటిల్ గెల్చుకున్న లక్ష్మణ్‌కు బహుమతి అందిస్తున్న సీఐ, స్వామి

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి బెల్లంపల్లిలో అట్టహాసంగా ముగిశాయి. స్కైజిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మిస్టర్ ఐరన్ మ్యాన్‌గా ఎండి.అన్వర్(మంచిర్యాల), మిస్టర్ బెల్లంపల్లిగా జి.లక్ష్మణ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాడీ బిల్డర్లు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బెల్లంపల్లి రూరల్ సీఐ ఎండి.అఫ్జలుద్దీన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, ఉదయ్‌కిరణ్, మాజీ మిస్టర్ ఇండియా(రైల్వేస్) పి.రాజు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.రాకేష్, మిస్టర్ కోల్ ఇండియా బాడీ బిల్డర్లు నాగమల్లేశ్వరరావు, ఓరం సురేష్, స్కై జిమ్ నిర్వాహకులు సదానందం, చంద్రశేఖర్, సీనియర్ బాడీ బిల్డర్లు కేఎస్‌ఎన్ రాజు, మారయ్య, సమ్మయ్య, జే.మురహరిరావు, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: ఇటీవల సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగం సాధించిన 40 మందికి ఏరియాలోని గనుల వృత్తి శిక్షణ కేంద్రం (ఎంవీటీసీ)లో సోమవారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం మనోహర్ హాజరై తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ఐదు రోజుల పాటు ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ ఫ్యాకల్టీచే నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, ఎంవీటీసీ మేనేజర్ గుండేటి శంకర్, అసిస్టెంట్ ట్రెయినీ మేనేజర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్సులు ప్రారంభం

ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో గ్యాస్, ఆర్క్ వెల్డింగ్ కోర్సుల శిక్షణ తరగతులను జీఎం ప్రారంభించారు. 24 మంది నిరుద్యోగ యువకులకు నాలుగు వారాలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఐఎన్టీయూసీ పనిచేస్తోందని ఆ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. సోమవారం ఆర్కే 6 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కృషి వల్లే నేడు కంపెనీ రూ.కోటి ఇన్సురెన్సు అమలుకు పూనుకుందన్నారు. దీనికోసం పలుమార్లు అధికారులతో చర్చించారన్నారు. అనంతరం గని మేనేజర్ తిరుపతిని కలిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేని శ్యాం, బ్రాంచ్ నాయకులు లేగల శ్రీనివాస్, వెంగళ కుమారస్వామి, రాంచందర్, విజయపాల్ రెడ్డి, భీమ్ రవి, చిలుముల రాయమల్లు, వెంకటరాజం, అశోక్ పాల్గొన్నారు.

మహిళలకు క్రీడా పోటీలు



త్రోబాల్ ఆడుతున్న మహిళలు

శ్రీరాంపూర్: ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం సోమవారం నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించింది. డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్, సెక్రెటరీ కొట్టే జ్యోతి, సభ్యులు శారద, మంగ సునీత, రజిత, భవాని, మమత, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

మంచిర్యాలఅర్బన్: ఇంటర్, పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సెక్టోరల్ అధికారి (జీఈసీవో) యశోధర సూచించారు. సోమవారం మంచిర్యాల కేజీబీవీని తనిఖీ చేశారు. పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. పరీక్షలంటే భయపడవద్దని సలహాలు, సూచనలు ఇస్తూ ఆత్మస్థైర్యం నింపారు. ఉద్యోగులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం మోడల్‌స్కూల్ ఆవరణలో ఉన్న బాలికల వసతి గృహాన్ని సందర్శించారు.



మాట్లాడుతున్న సెక్టోరల్ అధికారి యశోధర

ఉద్యమకారులకు ధ్రువీకరణ పత్రాలు



ధ్రువీకరణ పత్రాలతో ఉద్యమకారులు

జన్నారం: మండలానికి చెందిన నలుగురు తెలంగాణ ఉద్యమకారులకు లక్సెట్టిపేట సబ్‌జైల్ సూపరింటెండెంట్ సోమవారం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. 2009 లో తెలంగాణ ఉద్యమ సమయంలో తపాలపూర్‌కు చెందిన కమ్మల విజయధర్మా, కంది రవి, కంది సతీశ్, దాసరి రమేశ్ తాళ్లపేట్ రేంజ్ కార్యాలయం ధ్వంసం చేసిన కేసులో జైలుకు వెళ్లారు. పలు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులకు పథకాలు ప్రవేశ పెట్టడంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు విజయ ధర్మా తెలిపారు.

యోగా మాస్టర్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న భగవాన్‌దాస్

లక్సెట్టిపేట(మంచిర్యాల): పట్టణంలోని గోదావరి రోడ్‌కు చెందిన రాపల్లి భగవాన్‌దాస్‌కు బెస్ట్ యోగా మాస్టర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 3న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 7వ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగ అవార్డు అందుకున్నారు. పలువురికి యోగాలో శిక్షణ ఇస్తున్నందుకు అవార్డు లభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.